క్లుప్తంగా

ఎమ్మెల్యే శివకుమార్‌కు వినతి

తెనాలిఅర్బన్: పాత పెన్షన్ పద్ధతినే కొనసాగించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీసీపీఎస్ ఉద్యోగ సంఘ నాయకులు శనివారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఉద్యోగ సంఘ నాయకులు తిరుమలరెడ్డి, కెవివి.కిషోర్, దుర్గాప్రసాద్, కరిముల్లా, రాజు పాల్గొన్నారు.

నేడు భక్తిరంజని కార్యక్రమం

తెనాలిఅర్బన్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం, శ్రీ రామలింగేశ్వర భక్త సమాజం సంయుక్తంగా ఆదివారం భక్తి రంజని కార్యక్రమం నిర్వహించనున్నట్లు 35వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గౌడవర్తి శ్రీ సాయిహరేరామ్, నిర్వాహకులు కొండపి శ్రీనివాసరావు తెలిపారు. బోసురోడ్డులో శనివారం భక్తి రంజనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఆవరణలోని కళావేదికలో దీనిని నిర్వహించనున్నట్లు చెప్పారు. కొండపి వసుంధర బృందం, పలువురు చిన్నారులు భక్తి గీతాలాపన చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీ రామలింగేశ్వర భక్త సమాజం కన్వీనర్ పరుచూరు సుబ్బారావు, అందె బాలచంద్రమౌళి పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు కొనసాగించండి



తెనాలిఅర్బన్: ఎన్ఎస్ఎస్ విభాగం ద్వారా చేస్తున్న సేవ కార్యక్రమాలను కొనసాగించాలని జేఎంజే కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ సూచించారు. జేఎంజే కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ ద్వారా రక్తదాన శిబిరాలు, మొక్కలు పెంపకం, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.నిర్మల జ్యోతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.అరుణ సుజాత పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలిఅర్బన్: భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ నాయకులు నాగిశెట్టి సాయిచరణ్ సహకారంతో రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అన్నదాన కేంద్రంలో శనివారం పేదలకు, యాచకులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో డీజే సునీల్, కుర్రా శ్రీను, కోట అకేశ్వరరావు, ఎం.సుబ్రహ్మణ్యం, ఎస్‌డి.సద్దార్, మాలిక్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



తెనాలిరూరల్: గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పట్టణ మారీసుపేట గుర్రాల సందులో సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం రాత్రి గుర్తించారు. త్రీ టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా సేవా శాంతి ఆశ్రమంలో వృద్ధులకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. వెంకటేశ్వర యోగా సభ్యులు బూసా విశ్వేశ్వరవరప్రసాద్ వర్ధంతిని సందర్భంగా దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, భారతి, దుర్గాప్రసాద్, శివనాగజ్యోతి, మురళీకృష్ణ, హేమలత, కిషోర్, దేదీప్య, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, వై.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

తాడికొండ: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన లాం గ్రామ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. లాం గ్రామానికి చెందిన కంచెపాటి రాజ్యలక్ష్మి(72) గోరంట్ల వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో నడుచుకుంటూ వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. స్థానికులు ఆమెను గుంటూరు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి సోదరి గోలీ కోటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని నులకపేటలో ఉన్న హిందూ శ్మశానవాటికను అభివృద్ధి చేసేందుకు అధికారులు నిధులు కేటాయించారు. శనివారం నుంచి అభివృద్ధి పనులు చేపట్టారు. కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి రూ.8 లక్షలు కేటాయించి హిందూ శ్మశానవాటికలో పొదలు తొలగింపుతో పాటు, మృతి చెందిన వారికి దహన సంస్కారం నిర్వహించేందుకు ప్రత్యేకంగా షెడ్డును నిర్మిస్తున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. 15 రోజుల్లో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం



నందులపేటలో వినాయక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: వినాయక చవితి వేడుకల్లో భాగంగా తెనాలిలో పలు చోట్ల విఘ్నేశ్వరుడికి శనివారం పూజలు చేశారు. అలాగే పలు చోట్ల అన్నసంతర్పణ కార్యక్రమాలను నిర్వహించారు. నందులపేట కవి రాజా పార్కులో వైఎస్సార్ సీపీ నాయకులు ఢాకా అంకిరెడ్డి అండ్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని విగ్రహం వద్ద ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పూజలు చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే జగ్గడిగుంటపాలెంలోని ఇందిరా ప్రియదర్శిని గౌడ కాలనీలో గ్రామ సర్పంచి కుంభం బాలాజీ అండ్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. విఘ్నేశ్వరునికి పూజలు చేశారు. బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ రామాలయం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు ముద్రబోయిన మహేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, కాళిదాసు వెంకటేశ్వరరావు, సిరికృష్ణ పాల్గొన్నారు.

తెనాలిటౌన్: వినాయక చవితి పండుగ సందర్భంగా పట్టణ, రూరల్ గ్రామాల్లోని వివిధ సెంటర్‌లలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద భక్తులు విశేషంగా పూజలు నిర్వహిస్తున్నారు. విగ్రహాలను ట్రాక్టర్‌లపై ఉంచి ఊరేగించి శనివారం నిమజ్జనానికి తరలించారు. పట్టణ మారీసుపేటలోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో గణపతి విగ్రహానికి హరిద్ర గణపతి అలంకరణ చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు గ్రంధిసేతు మాధవరావు, కార్యదర్శి పొన్నూరు నాగ సూర్యశిధరరావు, కోశాధికారి వరద శేషగిరిరావు పర్యవేక్షించారు.

■ రూరల్ మండలం కంచర్లపాలెంలో రజకపేటలో ఆరో గణపతి మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా నిమజ్జనోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ పాదిలి శ్రీనివాసరావు, గణేష్ యూత్ సభ్యులు అనిల్, వెంకటేష్, దేవా, సంతోష్, సాయి, సుబ్బు, మణి, గణేష్, జీవన్, నీతిన్, సాగర్, నవీన్, అరవింద్, సతీష్, నిశాంత్, అమర్, అమీన్‌బాబు పాల్గొన్నారు.



కంచర్లపాలెంలో లడ్డూ వేలం పాట నిర్వహిస్తున్న నిర్వాహకులు

■ రూరల్ మండలం కొలకలూరులోని బీసీ కాలనీలో జై గణేష్‌యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు వైభవంగా నిర్వహించారు. భక్తులు అన్నదానం చేశారు. గణేష్ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కొమ్మమూరు కాల్వలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కాలిశెట్టి శ్రీనివాసరావు, బొంత నాగరాజు, మద్దెల రాజా, గమిడి శ్రీను, మైలా వాసు, సర్వీశెట్టి కృష్ణ, గుంపెన సురేష్, మొవ్వా శంకర్, పఠాన్ బాజీ, మద్దెల కుమార్, సుభానీ, సాంబయ్య పాల్గొన్నారు.



కొలకలూరు బీసీ కాలనీలో ట్రాక్టర్‌పై గణేష్ విగ్రహం ఊరేగింపు

గ్రామ సచివాలయాల ఘనత సీఎం వైఎస్ జగన్‌దే

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- గుడివాడలో అభివృద్ధి పనులు ప్రారంభం



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఎంపీపీ శ్రీనివాసరావు

తెనాలిటౌన్: గ్రామ సచివాలయాల ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. మండలంలోని గుడివాడ గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌లను శనివారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభకు ఎంపీపీ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సభలో ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ గుడివాడలో ఒకే సెంటర్‌లో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌లను ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. ప్రజల అవసరాలు తీర్చడమే ప్రభుత్వ లక్ష్యంగా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వివిధ అభివృద్ధి పనులను రూ.1.73 కోట్లతో చేపట్టమని వివరించారు. గ్రామంలో గడపగడపకు తిరిగినప్పుడు కొంతమంది ఇళ్ల స్థలాల ఇప్పించాలని కోరారని, మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ హయాంలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జీవితంలో తాను మరచిపోలేనని తెలిపారు. జెడ్పీటీసీ ఉమాప్రణతి మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధుల ద్వారా గ్రామంలో అభివృద్ధికి సహకరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి యడ్లపాటి రాకేష్, కోపల్లె సర్పంచి చింతల కుమారి, ఎంపీటీసీ సభ్యులు కారుమంచి కిషోర్‌కుమార్, కార్యాలయాల నిర్మాణ సమన్వయకర్త బొడ్డులూరి పద్మావతి, సచివాలయ కన్వీనర్ బండికళ్ల అజయ్‌రాణి, పార్టీ నాయకులు మత్తై రాజకుమారి, బి.రమేష్, కె.శివరామబ్రహ్మం, బి.పూర్ణయ్య, బి.సతీష్, తురక రాజేష్, మత్తై ధనకిషోర్, పిల్లి సల్మాన్‌రాజు, బండి అబ్రహాం, యంద్రపాటి రవికుమార్, పీఆర్‌డీఈ గుప్తా, ఏఈ వెంకటేశ్వరరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.ఉషారాణి, వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడవద్దు



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న కేఎల్ విశ్వవిద్యాలయ విద్యార్థులు

మంగళగిరి: సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని సాక్ డైరెక్టర్ సాయి విజయ్, సీఈఏ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు అన్నారు. కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ లోని సెంటర్ ఫర్ యాక్షన్స్ ఆక్టివిటీస్(సీఈఏ) ఆధ్వర్యంలో శనివారం కార్పొరేషన్ పరిధి ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామస్తులతో పాటు 9,10వ తరగతి విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంత మంది సైబర్ నేరగాళ్లు కొత్త ఆలోచనలతో ప్రజలకు, విద్యార్థులకు వివిధ రకాల మెసేజ్‌ల ద్వారా మోసపూరితమైన లింకులను పంపుతున్నారని హెచ్చరించారు. అటువంటి మోసపూరిత లింకులను క్లిక్ చేయడం వల్ల పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయని ఎర వేస్తారని చెప్పారు. దీంతో పాటు కంప్యూటర్లు, ల్యాప్ టాప్‌లు ఉచితంగా ఇస్తామని చెబుతూ వారు పంపే మెసేజ్‌ల వల్ల కొన్ని సందర్భాల్లో ఆధార్ కార్డుల్లో మార్పులు చేయడం ద్వారా మీ బ్యాంకు లావాదేవీల పైన ప్రభావం చూపే ప్రమాదం ఉందని వివరించారు. వివిధ రకాల బ్యాంకుల పేరుతో కూడా మోసాలు జరుగుతున్నాయని, అందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మొబైల్‌కు వచ్చిన ఓటీపీలను ఎవరికీ చెప్పకూడదని, ఓటీపీల ద్వారా సైబర్ నేరగాళ్లు ప్రజల ఖాతాల్లో నుంచి పెద్ద మొత్తంలో నగదు దోచుకుంటారని, కృత్రిమ మేధ టెక్నాలజీని వాడి మీకు తెలిసిన గొంతుతో మాట్లాడించి మీ యొక్క ఖాతాలో ఉన్న నగదును దోచుకునే ప్రమాదం కూడా ఉందని చెప్పారు. ఆన్‌లైన్‌లో లోన్లు ఇస్తామని లింకులు పంపించి లింకులు నొక్కిన తరువాత అతని యొక్క డేటా మొత్తం నేరగాళ్లకు చేరి వాళ్ల ఫొటోలను మార్ఫింగ్ చేసే ప్రమాదం కూడా లేకపోలేదని వివరించారు.

తాగునీటి సరఫరాపై అప్రమత్తం

- కార్పొరేషన్ కమిషనర్ శారదాదేవి
- అన్ని శాఖల అధికారులతో క్షేత్ర స్థాయిలో పర్యటన
- అన్ని ఏరియాలలో శాంపిల్స్ సేకరణ



రత్నాలచెరువులో తాగునీటి సరఫరాపై ఆరా తీస్తున్న కమిషనర్ శారదాదేవి

మంగళగిరి: పట్టణంలో కలుషిత తాగునీటి సరఫరాతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారనే వార్తలతో అధికారయంత్రాంగం అప్రమత్తమైంది. శుక్రవారం రాత్రే అనుమానిత ప్రాంతాలలలో నీటిని సేకరించి ల్యాబ్‌కు పంపారు. శనివారం తెల్లవారుజామున తాగునీటి సరఫరా సమయంలో కమీషనర్ యు శారదాదేవి పట్టణంలోని అన్ని ఏరియాలలో పర్యటించి తాగునీటి సరఫరాను పరిశీలించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలుషిత తాగునీటి కారణంగా పలువురు అనారోగ్యానికి కారణమై ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారని వార్తలు రావడంతో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి కమిటీని నియమించారు. ఆర్డీఓ ప్రభాకర్‌రెడ్డి, ప్రజారోగ్య శాఖ ఎస్ఈ ఎన్.శ్రీనివాసులు, డీఎంహెచ్ఓ ఏ శ్రవణ్‌బాబు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎన్.పూర్ణచంద్రరావు, సివిల్ సర్జన్ బయాలజిస్ట్ డాక్టర్ శోభారాణిలతో కమిటీని ఏర్పాటు చేయగా శనివారం పట్టణంలోని పలు ప్రాంతాలలో క్షేత్ర స్థాయిలో పర్యటించి నీటి శాంపిల్స్‌ను సేకరించారు.

ఆందోళన అవసరం లేదు..

తాగునీటి సరఫరాపై సమావేశం నిర్వహించిన అనంతరం కమిషనర్ యు.శారదాదేవి మాట్లాడుతూ సమస్య తమ దృష్టికి వచ్చిన వెంటనే అధిక ప్రభావం ఉన్న రత్నాల చెరువుతో పాటు కొత్తపేట పలు ప్రాంతాలలో పర్యటించి నీటి శాంపిల్స్‌ని సేకరించి ల్యాబ్‌కు పంపడంతో పాటు ప్రజల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. శనివారం మరలా తాగునీటి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపడం జరిగిందన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రస్తుతం నాణ్యమైన తాగునీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు.

సీసీ కెమెరాల పరిశీలన

తెనాలిరూరల్: పట్టణ ఐతానగర్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇక్కడి లింగారావు సెంటరు, ఎన్‌జీ రంగా విగ్రహం సెంటరులో కెమెరాలను ఏర్పాటు చేయించారు. వీటిని శనివారం సాయంత్రం టూటౌన్ సీఐ ఎస్, వెంకట్రావు, ఎస్ఐ టి. రమేష్‌బాబు సిబ్బందితో కలసి పరిశీలించారు. జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఇటీవల పట్టణానికి వచ్చిన సందర్భంగా ఐతానగర్‌లో పర్యటించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. ఈ ప్రాంతంలో రౌడీషీటర్లు ఎక్కువగా ఉండడం, గంజాయి వినియోగం జరుగుతున్న నేపథ్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు నిఘా పటిష్టం చేయాలని ఎస్పీ సూచించారు. ఈ నేపథ్యంలో సీసీ కెమెరాలను పరిశీలించిన సీఐ మాట్లాడుతూ కెమెరాల నియంత్రణ పోలీస్ స్టేషన్‌లో ఉండేలా చర్యలు తీసుకున్నామని, కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానం చేసినట్లు చెప్పారు. మరి కొన్ని ప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

యువకుడిపై దాడి

తెనాలిరూరల్: గణేష్ నిమజ్జనం ఊరేగింపు చూసేందుకు వెళ్లిన యువకుడిపై దాడి చేసి గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసులు కథనం.. నందులపేటకు చెందిన యువకుడు మనోజ్ వినాయకుడి ఊరేగింపు చూసేందుకు శుక్రవారం రాత్రి నాజరుపేటకు వెళ్లాడు. అక్కడ స్వల్ప విషయమై బొమ్మిశెట్టి వెంకటేష్ మనోజ్‌పై కర్రతో దాడి చేసి గాయపరిచాడు. బాధితుడు చికిత్స పొందుతూ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

తెనాలి రూరల్: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు ఆదేశించారు. తెనాలి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రౌడీషీటర్లకు వివాదాలు ఘర్షణల్లో ప్రమేయం ఉన్నట్టు తెలిస్తే సహించేది లేదన్నారు. సత్ప్రవర్తన కలిగిన వారిపై షీట్ ఎత్తివేసే అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎస్ఐ ప్రసన్నకుమార్, సిబ్బంది ఉన్నారు.

మత్తు పదార్థాలదుర్వినియోగంపై అవగాహన

తాడేపల్లిరూరల్: మత్తు పదార్థాల వాడకం వలన జీవితాలు నాశనమవుతాయని కేఎల్ యూనివర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు పేర్కొన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నషాముక్తి అభియాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తొలుత వడ్డేశ్వరంలోని మెయిన్‌సెంటర్‌లో విద్యార్థులు మానవహారం నిర్వహించారు. క్లబ్స్ ఇన్‌చార్జి డాక్టర్ ఆర్.సుభాకరరాజు మాట్లాడుతూ మత్తు పదార్థం జీవితాన్ని నాశనం చేస్తుందని అన్నారు. అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లను, సమన్వయకర్తలుగా వ్యవహరించిన పి.సురేష్, జి.చంద్రశేఖర్, వి.జి.కృష్ణమూర్తి వ్యవహరించారు.

నిడమర్రులో స్కూల్ గేమ్స్ ప్రారంభం

మంగళగిరి: కార్పొరేషన్ పరిధి నిడమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం స్కూల్ గేమ్స్ ప్రారంభమయ్యాయి. నియోజకవర్గ స్థాయిలో మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల పరిధిలోని ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు కబడ్డీ, కోకో, బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను ప్రధానోపాధ్యాయులు ఎస్.వెంకటేశ్వరరావు ప్రారంభించారు.

గొప్ప రసాత్మకవాది సంజీవదేవ్

చర్చా వేదికలో కొత్తపల్లి రవిబాబు



మాట్లాడుతున్న కొత్తపల్లి రవిబాబు

తెనాలి: ప్రముఖ చిత్రకారుడు, భావుకుడు సంజీవదేవ్ రసాత్మకవాది అని ప్రజాసాహితి ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు అన్నారు. 'ఆహ్వానం లక్ష్మి' సంస్మరణలో భాగంగా పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక 'భిన్నస్వరాలు' ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఇక్కడి కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఎప్పటికీ...అందరికీ... సంజీవదేవ్' పుస్తకంపై చర్చావేదిక నిర్వహించారు. రవిబాబు చర్చను ప్రారంభిస్తూ, నైరూప్య చిత్రకారుడు, చిత్రకళా విశ్లేషకుడైన సంజీవదేవ్ హిమాలయ పర్వతాల మొదలు దేశమంతా పర్యటించి, ఆయా ప్రాంత కళాప్రతిభావంతులతో స్నేహసంబంధాలు నెరిపారని చెప్పారు. మన ప్రాంతపు గొప్ప తాత్విక చింతనాపరుడైన సంజీవదేవ్‌ను ప్రతిభా విశేషాలు, వ్యక్తిత్వాన్ని తాజా పుస్తకం వివరించినట్లు చెప్పారు. సాహితీవేత్త సశ్రీ మాట్లాడుతూ, ప్రతిభావంతమైన సాహితీ సృజనతో పరిణితి కలిగిన పాఠకులతో సంజీవదేవ్, కలసి నడిచారని చెప్పారు. సాహితీవేత్తలు ఎందరో సామాజిక స్పృహ అనే డొంకను పట్టుకుని విస్తరించే క్రమంలో సంజీవదేవ్ తొలి ఆర్తి సాహిత్య స్పృహగా భావించవచ్చని అన్నారు. తనదైన రచనా శైలిని పాఠకలోకానికి పరిచయం చేసి మెప్పించారని చెప్పారు. ఒక మనిషి తోటి మనిషిని ప్రేమించటమే సాహిత్య సృజన లక్ష్యంగా నిరూపించారని తెలిపారు. విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ మన్నవ సత్యనారాయణ తన ప్రసంగంలో గొప్ప రచయిత, రసాత్మక చిత్రకారుడు సంజీవదేవ్ ఔన్నత్యాన్ని, ఆయనను చదవాల్సిన, తెలుసుకోవాల్సిన అవసరాన్ని తాజా పుస్తకం చెబుతుందని అన్నారు. పుస్తక రచయిత బి.లలితానంద ప్రసాద్ మాట్లాడుతూ, తన రచన నేపథ్యాన్ని, సంజీవదేవ్‌తో తనకు గల పరిచయాన్ని వివరించారు. తొలుత సంస్థ కన్వీనర్ కేవీ రాఘవరెడ్డి స్వాగతం పలికారు. జుగాష్‌విలి, పిల్లి వాసు, కనపర్తి బెన్‌హర్, బొమ్మదేవర వెంకటేశ్వరరావు, ముట్టడి ప్రకాష్, గోపాల్, షేక్ అబ్దుల్ హకీం జాని, నారాయణరావు పాల్గొన్నారు.

రైతు రక్షణతోనే వ్యవసాయ పరిరక్షణ సాధ్యం

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య



మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

తెనాలి: రైతులను రక్షించుకుంటేనే వ్యవసాయ రంగాన్ని కాపాడుకోగలమని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అధ్యక్షుడు వి.కృష్ణయ్య అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం రైతుసంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకర్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. కృష్ణయ్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం వ్యవసాయం, రైతులకు తగిన ప్రాధాన్యత ఇవ్వటం లేదన్నారు. తగిన పోరాటాలతోనే హక్కులను సాధించుకోగలమని చెప్పారు. రైతాంగ ఉద్యమాలు–చరిత్ర అంశంపై రాష్ట్ర నాయకుడు వై.కేశవరావు మాట్లాడుతూ 1936లో దేశంలో రైతుసంఘం ఏర్పాటుకాగా, అంతకుముందే 1922లో గుంటూరు జిల్లాలో సంఘం ఏర్పాటైనట్లు తెలిపారు. అప్పట్నుంచి అనేక రూపాల్లో ఆందోళనలు, ఉద్యమాలు చేపట్టి పలు సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు వివరించారు. 540 సంఘాలతో చరిత్రలో నిలిచే విధంగా జరిగిన జరిగిన ఢిల్లీ రైతు పోరాటంలోనూ రైతుసంఘం అగ్రభాగాన నిలిచిందని చెప్పారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతాంగ ఉద్యమాలను చేపట్టి, విజయవంతం చేయటంలో గుంటూరు జిల్లా రైతుసంఘం ముందంజలో ఉందన్నారు. గత 15 ఏళ్లుగా కౌలురైతులకు గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సబ్సిడీలు ఇప్పిస్తున్నట్టు చెప్పారు. అప్పుల్లో కూరుకుపోయిన రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలనే డిమాండ్‌తో భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తున్నామని తెలిపారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, ముద్దన వెంకటేశ్వర్లు, చింతల భాస్కరరావు, ఆళ్ల సాంబిరెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, వై.బ్రహ్మేశ్వరరావు, ఐ.రామారావు, ముద్దన సాంబశివరావు, ఎం.కుమారి పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి బీఎస్పీ కృషి

రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి

తెనాలిఅర్బన్: బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉండటంతో పాటు వారి సంక్షేమానికి బీఎస్పీ కృషి చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.పరంజ్యోతి పేర్కొన్నారు. ఐతానగర్‌లోని ఎర్రబడి వద్ద శనివారం సాయంత్రం బీఎస్పీ ఆధ్వర్యంలో ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో నాయకులు ఎల్.కుమార్, కూరపాటి సుబ్బారావు, కాగిత కోటేశ్వరరావు, దాసరి వెంకటేశ్వరరావు, గూడవల్లి మణికుమారి, యాతాటి కిషోర్, మట్లపూడి సాంబశివరావు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేత



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో సిస్టర్ నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ రెహ్మాన్

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు నిర్మలా ఫార్మసీ కళాశాలలో ఆదివారం జాతీయ సేవా పథకం ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. రెహ్మాన్ శనివారం తెలిపారు. జాతీయ సేవా కార్యక్రమాల్లో భాగంగా మెడికల్ క్యాంప్, ర్యాలీ, స్వచ్ఛ భారత్, మొక్కలు నాటడం, యూత్ సర్వే, ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంపుల్లో పాల్గొనే విద్యార్థినీ విద్యార్థులకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రశంసా పత్రాలను అందజేయగా వాటిని విద్యార్థులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ శిక్షణాధికారి రేఖా నరేష్‌బాబు పాల్గొనగా సేవా కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన కోట నిహారిక, ఎం వికాస్‌లకు కళాశాల సెక్రటరీ సిస్టర్ జి నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ రెహ్మాన్ ఉత్తమ విద్యార్థుల సమన్వయ కర్తల అవార్డులను అందజేశారు.

'అమ్మ తలపులు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రభాకర్, దుర్గా ప్రసాద్, మస్తానయ్య తదితరులు

పాత గుంటూరు: భారతీయ సంగీతానికి ప్రకృతి పరవశిస్తుండటం జగమెరిగిన సత్యం అని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఓఎస్‌డీ డాక్టర్ ఎం. ప్రభాకర్ పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం పద్మావతి కల్యాణ వేదికపై శనివారం ప్రముఖ డోలు విద్వాంసుడు భూసురపల్లి ఆదిశేషయ్య ఆరాధన ఉత్సవం ఘనంగా నిర్వహించారు. సభకు సాహిత్యవేత్త మోదుగుల రవికృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 'అమ్మ తలపులు' పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం భూసురపల్లి ఆదిశేషయ్య సంగీత పురస్కారాన్ని కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత ద్వారం దుర్గా ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ఎం. కోటేశ్వరరావు, డాక్టర్ సి. చంద్రమోహన్, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, డాక్టర్ భూసురుపల్లి వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, రాహుల సురేష్ బాబు, ప్రదీప్తి, ప్రహ్లాదుడు, మౌనిక, వేదవ్యాసుడు పాల్గొన్నారు.